ఈనాడు
వికారాబాద్
బుధవారం అక్టోబరు 9, 2024

కలెక్టరేట్‌లో ఘనంగా బతుకమ్మ వేడుకలు


ఆటపాటల్లో కలెక్టర్ ప్రతీక్‌జైన్, అధికారులు

వికారాబాద్ కలెక్టరేట్, న్యూస్‌టుడే: జిల్లా కలెక్టర్ కార్యాలయంలో బతుకమ్మ వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్ గౌరీ మాతకు పూజలు చేశారు. డీఆర్‌డీఏ, డీడబ్ల్యూవో ఆధ్వర్యంలో బతుకమ్మ వేడుకలను ఏర్పాటు చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ పూలతో అందగా బతుకమ్మలను పేర్చి వేడుకలను ఎంతో ఆనందంగా నిర్వహించడం సంతోషదాయకమన్నారు. ఆయా శాఖలకు చెందిన మహిళలు, ప్రభుత్వ ఉద్యోగులు స్వయంగా బతుకమ్మలను పేర్చి ఒక దగ్గరకు చేర్చి వాటి చుట్టూ తిరుగుతూ పాటలు పాడుతూ సంతోషంగా సందడి చేశారు. కలెక్టర్ సైతం బతుకమ్మల వద్దకు వెళ్లి ఆడిపాడి వారిలో ఉత్సాహాన్ని నింపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్లు లింగ్యానాయక్, సుధీర్, జిల్లా అధికారులు శ్రీనివాస్, కృష్ణవేణి, సరోజ, చెన్నమ్మ పాల్గొన్నారు.

వికారాబాద్ మున్సిపాలిటీ, న్యూస్‌టుడే: వికారాబాద్ శ్రీరామ మందిరంలో ఆర్యవైశ్య మహిళా సంఘం ఆధ్వర్యంలో సోమవారం రాత్రి సద్దుల బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు యాస్కి శిరీష, పట్టణ అధ్యక్షురాలు మ్యాడం లక్ష్మి, మహాదేవి, జగదీశ్వరి, సువర్ణ, పోకల మమత, శ్రీదేవి, విజయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.


శ్రీరామ మందిరంలో ఆర్యవైశ్య మహిళా సంఘం సభ్యులు

మహాలక్ష్మీ నమోస్తుతే..!


కట్టమైసమ్మ ఆలయంలో లక్ష్మీదేవి అలంకారం


నగరేశ్వర దేవాలయంలో..

తాండూరు పట్టణంలోని నగరేశ్వర, కట్ట మైసమ్మ దేవాలయాల్లో అమ్మవారిని మంగళవారం లక్ష్మీదేవిగా అలంకరించారు. మండపాల వద్ద మహిళలు దాండియా ఆడుతూ సందడి చేశారు. బసవణ్ణకట్ట వద్ద అమ్మవారికి ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి ప్రత్యేక పూజలు చేసి మహా హారతి ఇచ్చారు.
– న్యూస్‌టుడే, తాండూరు టౌన్.

కూరగాయల ఖిల్లా.. జేబులు గుల్ల

దడ పుట్టిస్తున్న ధరలు

న్యూస్‌టుడే, పరిగి, వికారాబాద్ కలెక్టరేట్:

అసలే పండగల సీజన్. సాధారణ రోజులతో పోల్చితే కాస్త ఖర్చులు ఎక్కువే. ఇలాంటి సమయంలో ఓవైపు నిత్యావసరాలు, మరోవైపు కూరగాయల ధరలు తారా జువ్వల మాదిరి పైపైకి పోతున్నాయి. వీటిని అందుకునే స్తోమత లేక సామాన్యుడి మొదలు ఉన్నతాదాయ వర్గాల వరకు బెంబేలెత్తిపోతున్నారు. దీనికి సంబంధించి 'న్యూస్‌టుడే' కథనం.


సంతలో విక్రయాలు

రైతులకు చేకూరని ప్రయోజనం

సంవత్సరాలుగా 'కూరగాయల హబ్'గా వికారాబాద్ జిల్లాకు పేరుంది. మొత్తం 20 మండలాల్లో పంటలు సాగుతున్నాయి. కానీ రైతులకు, వినియోగదారులకు మాత్రం ప్రయోజనం లేకుండా పోతోంది. పండిన పంటను దాచేందుకు సరైన గిడ్డంగులు లేవు. శీతల గిడ్డంగుల ఊసే లేదు. దీంతో రైతులకు కష్టానికి తగిన ఫలితం దక్కడంలేదు. దళారులకు మాత్రం లాభిస్తోంది.

● జిల్లాలోని వికారాబాద్, పరిగి, కొడంగల్, తాండూరు నియోజకవర్గాల పరిధిలో ఖరీఫ్‌లో 4904 ఎకరాల్లో వివిధ రకాల కూరగాయలు సాగులోకి వచ్చాయి. వెరసి లక్ష టన్నుల ఉత్పత్తి అంచనా. వేసవిలో దాదాపు 9వేల ఎకరాలకు పైగా సాగులోకి వచ్చే అవకాశముంది. స్థానికంగా పండిస్తున్నా ధరలు దిగిరావడంలేదు. ఉన్నంతలో సర్దుకుపోవాల్సి వస్తోందని వినియోగదారులు వాపోతున్నారు. రూ.50కి ఏవీ తక్కువగా లభించడం లేదని చివరకు ఆకు కూరలు సైతం కిలోకు రూ.40నుంచి రూ.80 వరకు విక్రయిస్తున్నారని తెలిపారు.

ఖరీఫ్ సాగు వివరాలు
- కూరగాయలు పండిస్తున్న రైతులు: 5977
- సాగు విస్తీర్ణం: 4904.39 ఎకరాలు
- దిగుబడి అంచనా: లక్ష టన్నులు

మార్కెట్లో కిలో రూ. చొప్పున.. ఇలా పలుకుతున్నాయి

పచ్చిమిరప	60
క్యారెట్	60
వంకాయ	60
బెండ	80
గోకర	80
దొండ	60
బీర	80
ఆలుగడ్డ	60
ఉల్లిగడ్డ	80
బీట్‌రూట్	80
క్యాప్సికం	60
క్యాలీఫ్లవర్	80

ఏడాదిగా తగ్గడం లేదు

– నర్సమ్మ, గృహిణి, దౌల్తాబాద్



నిత్యావసర సరుకుల ధరలకు తోడు కూరగాయల ధరలు కూడా మండిపోతున్నాయి. సామాన్యులు ఎక్కువగా వాడే టమాట ధర మళ్లీ పెరుగుతూ వస్తోంది. పండగల సమయంలో కొనుగోలు చేయడం తలకుమించిన భారంగా మారుతోంది. పేదలకు అందుబాటులో ఉండే విధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టాలి.

పెరటి తోటలపై దృష్టి సారించాలి

– వైజయంతి, ఉద్యానాధికారిణి, పరిగి డివిజన్



ధరల నుంచి పేదలు బయటపడేందుకు పెరటి తోటల పెంపకం ఎంతో మేలు. ఇళ్ల ముందు ఖాళీ స్థలాలు ఉంటే చాలు రకరకాల కూరగాయలు, చిన్నచిన్న తొట్లలో ఆకు కూరలను పండించుకోవడం అన్ని విధాలుగా కలిసి వస్తుంది. ఇంటి పైకప్పుల పైనా సులువుగా సాగు చేసుకోవచ్చు. ఆరోగ్యానికి ఎంతో మేలు కలుగుతుంది.

టమాట @ 100



పెద్దేముల్ సంతలో మంగళవారం టమాట కిలో ఏకంగా రూ.100 పలికింది. వెల్లుల్లి కిలో రూ.200 చొప్పున విక్రయించారు. దీంతో వినియోగదారులు ఒక్కసారిగా వాపోయారు. చేసేది లేక కొద్ది మేర మాత్రమే కొనుగోలు చేశారు. అధిక వర్షాలు కూరగాయ పంటలను దెబ్బతీయడంతో ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయని రైతులు తెలిపారు.
– న్యూస్‌టుడే, పెద్దేముల్.

5 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

నవాబ్‌పేట: నల్గొండకు చెందిన శ్రీకాంత్, రవి మంగళవారం నవాబ్‌పేట మండలంలోని గుబ్బడిఫతేపూర్‌లో 5 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని సేకరించి తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నారని ఎస్ఐ అరుణ్‌కుమార్ తెలిపారు. వారిపై కేసు నమోదు చేశామన్నారు. బియ్యాన్ని హైదరాబాద్‌లో ఎక్కువ ధరకు విక్రయిస్తున్నట్లు వారు తెలిపారన్నారు.

పత్తి కొనుగోళ్లలో ఇబ్బందులు రావొద్దు

వికారాబాద్ కలెక్టరేట్, న్యూస్‌టుడే: రైతులకు ఇబ్బందులు కలుగకుండా పత్తి కొనుగోలుకు అన్ని రకాల ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ప్రతీక్‌జైన్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో పత్తి కొనుగోలుపై సంబంధిత అధికారులు, ట్రేడర్లతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. జిల్లాలో సుమారుగా 2 లక్షల మెట్రిక్ టన్నుల పత్తి దిగుబడి వచ్చే అవకాశం ఉందన్నారు. పత్తి మిల్లుల వద్ద తూకం యంత్రాలను సరిచూసుకోవాలన్నారు. సెలవు రోజుల్లో పత్తి విక్రయానికి మిల్లుల వద్దకు తీసుకు రావద్దని రైతులకు సూచించారు. జిల్లా అదనపు కలెక్టర్లు లింగ్యానాయక్, సుధీర్, అదనపు ఎస్పీ రవీందర్‌రెడ్డి, జిల్లా అధికారులు సారంగపాణి, మోహన్‌రెడ్డి, విద్యుత్తు రవాణా, సీసీఏ అధికారులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు సదరం శిబిరాలు

వికారాబాద్ మున్సిపాలిటీ: జిల్లాలో దివ్యాంగుల కోసం ఈనెలలో సదరం శిబిరాలను నిర్వహిస్తున్నామని జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్ ఓ ప్రకటనలో తెలిపారు. తాండూరు ప్రభుత్వ ఆసుపత్రిలో ఈనెల 10, 24, 30 తేదీల్లో ఏర్పాటు చేస్తున్నారు. వికారాబాద్ ప్రభుత్వ ఆసుపత్రిలో ఈనెల 10, 18, 24, 29 తేదీల్లో నిర్వహిస్తామని ఆయన తెలిపారు. ఈ అవకాశాన్ని దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.


మెరుగైన వైద్య సేవలు అందించాలి

తాండూరు టౌన్: ఆస్పత్రిలో నిత్యం అందుబాటులో ఉంటూ రోగులకు మరింతగా మెరుగైన వైద్య సేవలు అందించాలని తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి వైద్యులకు సూచించారు. పట్టణ శివారులోని మాతా, శిశు సంరక్షణ కేంద్రంలో మంగళవారం సందర్శించారు. ఆస్పత్రిలోని చిన్నారులు, బాలింతలు, గర్భిణులు చికిత్సలు పొందుతున్న వార్డులను పరిశీలించారు. వారితో మాట్లాడారు. అనంతరం వైద్యులతో సమీక్ష సమావేశం నిర్వహించి మాట్లాడారు. రాత్రి వేళ ఆస్పత్రి వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని ఎస్పీ నారాయణరెడ్డితో ఫోన్‌లో మాట్లాడారు. ఆస్పత్రి ముందు ఆర్టీసీ బస్సులు ఆపాలని డీఎం సురేష్‌కు సూచించారు. జిల్లా ఆస్పత్రుల సమన్వయ అధికారి డాక్టర్ ప్రదీప్ కుమార్, ఆస్పత్రి పర్యవేక్షకుడు డాక్టరు రవిశంకర్, వైద్యులు శరత్ చంద్రకుమార్, అనిల్ కుమార్‌రెడ్డి, శాంతప్ప, మున్సిపల్ అధ్యక్షురాలు స్వప్న, కమిషనరు విక్రమసింహారెడ్డి, కౌన్సిలర్లు పాల్గొన్నారు.


రోగులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

అభివృద్ధి లక్ష్యంగా కలిసి పనిచేస్తా: ఎంపీ కొండా

వికారాబాద్ మున్సిపాలిటీ, చేవెళ్ల, న్యూస్‌టుడే: చేవెళ్ల ప్రాంత అభివృద్ధి విషయంలో రాజకీయాలకు అతీతంగా కలిసి పని చేస్తానని చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ పరిశ్రమల మంత్రిత్వ శాఖ స్థాయి సంఘ సమావేశంలో పాల్గొనడానికి దిల్లీ వెళ్లిన ఆయన న్యూదిల్లీ పర్యటనలో ఉన్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసి వికారాబాద్, రంగారెడ్డి జిల్లాలకు సంబంధించిన వివిధ విషయాలపై చర్చించారు. ముఖ్యంగా జీవో నంబరు 111 ప్రాంతాన్ని స్థిరాభివృద్ధి జోన్‌గా మార్చాలన్నారు. గత భారాస ప్రభుత్వం స్వాధీనం చేసుకున్న షాబాద్ మండలంలోని సీతారాంపురం దేవాలయ భూములను తిరిగి దేవాలయానికే అప్పగించాలని కోరారు. జంటనగరాల్లో నడుస్తున్న మురుగు శుద్ధి ప్లాంట్ల నిర్వహణపై పలు సూచనలు చేశారు.


సీఎం రేవంత్ రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న విశ్వేశ్వర్ రెడ్డి

విద్యపై ప్రభుత్వం చిన్నచూపు

ధారూర్, న్యూస్‌టుడే: విద్య పట్ల ప్రభుత్వం చిన్నచూపు చూస్తోందని మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని వేడుక వేదికలో పదో తరగతిలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు కొస్నం లక్ష్మారెడ్డి జ్ఞాపకార్థం మాజీ జడ్పీటీసీ కొస్నం సుజాత, భారాస మండల మాజీ అధ్యక్షులు వేణుగోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలో 2023-24 సంవత్సరంలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులందరినీ శాలువాలతో సన్మానించి జ్ఞాపికను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం విద్యా వ్యవస్థను పట్టించుకోవడం లేదన్నారు. ముఖ్యమంత్రి ఒకటి చెబితే, మంత్రులు మరోటి, అధికారులు ఇంకొకటి చెబుతున్నారన్నారు. భారాస ప్రభుత్వం వికారాబాద్‌కు మెడికల్ కళాశాల, డిగ్రీ కళాశాల ఇచ్చిందని, సీఎం రేవంత్ రెడ్డి వికారాబాద్‌కు ఇంజినీరింగ్ కళాశాలను తీసుకురావాలని డిమాండ్ చేశారు. విద్యార్థులు కన్న కలల సాకారం కోసం కష్టపడి చదివి ఉన్నతులుగా ఎదగాలన్నారు. కార్యక్రమంలో నాయకులు నాగేందర్ గౌడ్, విజయ్‌కుమార్, శుభప్రద్ పటేల్, సబితా ఆనంద్, భారాస మండల అధ్యక్షులు శ్రీకాంత్‌రెడ్డి, విద్యార్థులు, ఉపాధ్యాయులు ఉన్నారు.

సన్మానం పొందిన విద్యార్థులతో మాజీ మంత్రి సబిత, ప్రజా ప్రతినిధులు



సారా తరలింపు.. నలుగురిపై కేసు

తాండూరు, యాలాల, న్యూస్‌టుడే: ప్రభుత్వం నిషేధించిన సారాను తరలిస్తూ పట్టుబడిన నలుగురిపై ఆబ్కారీ పోలీసులు కేసును నమోదు చేశారు. ఓ ద్విచక్ర వాహనాన్ని జప్తు చేశారు. తాండూరు ఆబ్కారీ సీఐ బాల గంగాధర్ తెలిపిన ప్రకారం వివరాలు.. పెద్దేముల్ మండలం నీలిగడ్డ తండాకు చెందిన కెతావత్ రాజేష్, కెతావత్ సురేష్ సోమవారం సాయంత్రం ద్విచక్ర వాహనంపై యాలాల మండలం కోకట్ తండా వైపు వెళుతున్నారు. రూట్ వాచ్‌లో ఉన్న ఆబ్కారీ పోలీసులు ద్విచక్ర వాహనాన్ని ఆపి అనుమానంతో తనిఖీ చేశారు. వారి వద్ద 3 లీటర్ల నాటు సారా లభించింది. దీంతో ద్విచక్ర వాహనాన్ని జప్తు చేసి వారిపై కేసు నమోచేశారు. మరో ఘటనలో బషీరాబాద్ మండలం బహదూర్‌పూర్ తండాకు చెందిన లక్ష్మీ భాయి, ముడావత్ రాంసింగ్ 4 లీటర్ల సారాతో పట్టుబడ్డారు. సారా తయారీకి వినియోగించే 50 లీటర్ల బెల్లం పాకాన్ని పారబోశారు. వీరిపై కూడా కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు సీఐ తెలిపారు.

విద్యార్థులకు పౌష్టికాహారమే లక్ష్యం

తుది దశలో అక్షయ పాత్ర పనులు

న్యూస్‌టుడే, కొడంగల్:

ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే పిల్లల్లో ఎక్కువ మంది పౌష్టికాహార లోపంతో బాధ పడుతున్నారు. ఈ విషయాన్ని పలు సర్వేలు వెల్లడించాయి. పేదరికం కారణంగా ఇంట్లో సరైన ఆహారం లభించక అనేకమంది పాఠశాలల్లో లభించే మధ్యాహ్న భోజనంపైనే ఆధారపడుతున్నారని అధికారులు గుర్తించారు. అలాంటి వారికి బలవర్థకమైన పౌష్టికాహారం అందించాలనే ఉద్దేశంతో 'అక్షయ పాత్ర' పేరుతో ప్రభుత్వం కొత్త పథకం ప్రారంభించింది. ఇందుకోసం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి 'హరేరామ హరే కృష్ణ ఫౌండేషన్' ఆధ్వర్యంలో అల్పాహారం, భోజనం అందించేందుకు ఒప్పందం కుదుర్చుకున్నారు.


కొడంగల్‌లో నిర్మిస్తున్న బాహుబలి వంట గది

పైలెట్ ప్రాజెక్టుగా కొడంగల్ నియోజకవర్గం

పథకం అమలుకు సీఎం సొంత నియోజకవర్గం కొడంగల్‌ను పైలెట్ ప్రాజెక్టుగా ఎంపికచేశారు. నియోజకవర్గంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో 1వ తరగతి నుంచి 10వ తరగతి వరకు చదువుకొనే విద్యార్థులందరికీ అల్పాహారం, భోజనం అందిస్తారు. ఇందుకోసం కొడంగల్ పట్టణంలోని వృథాగా ఉన్న సమీకృత మార్కెట్ యార్డులో ఫౌండేషన్ వారు రూ.4 కోట్లతో బాహుబలి కిచెన్ షెడ్డు నిర్మిస్తున్నారు. ఫౌండేషన్ నుంచి రూ.2 కోట్లు, సీఎస్ఆర్ ఫౌండేషన్ నుంచి రూ.2 కోట్లు కేటాయించారు. పనులు అక్టోబర్ చివరి నాటికి పూర్తి చేస్తారు. ఇప్పటికే కొన్ని అక్షయ పాత్ర వస్తువులు చేరుకొన్నాయి. పైపులైన్‌ల ఏర్పాటు, గ్రానైట్ పనులు ముగింపు దశలో ఉన్నాయి. భవనానికి ఆరు బయట రంగులు వేస్తున్నారు.

28వేల మందికిపైగా విద్యార్థులకు లబ్ధి

నియోజకవర్గంలోని వికారాబాద్ జిల్లాకు సంబంధించి కొడంగల్, దౌల్తాబాద్, బొంరాస్‌పేట, దుద్యాల మండలాలు, నారాయణపేట జిల్లాకు సంబంధించి కోస్గి, మద్దూరు, గుండుమాల్, కొత్తపల్లి మండలాల్లో ఈ పథకం అమలవుతుంది. మొత్తం 312 ప్రభుత్వ పాఠశాలల్లో 1 నుంచి 10వ తరగతి వరకు గల 28,000కు పైగా గల విద్యార్థులకు లబ్ధి చేకూరుతుంది.

అల్పాహారం, భోజనం అందిస్తాం

హరేరామ హరే కృష్ణ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అక్షయ పాత్ర ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకొంటున్న విద్యార్థులకు బలవర్థకమైన అల్పాహారం, మధ్యాహ్న భోజనం అందిస్తారు. తొలి దశలో కొడంగల్ నియోజకవర్గంలోని 8 మండలాల విద్యార్థులకు సేవలు లభిస్తాయి. ఈ అక్టోబర్‌లో చివరలో అమలులోకి వచ్చే అవకాశాలు ఉన్నాయి. – **వెంకట్‌రెడ్డి, 'కడా' ప్రత్యేక అధికారి, కొడంగల్.**

ప్రతిభావంతులకు ఎస్పీ అభినందనలు



వికారాబాద్, న్యూస్‌టుడే: ఇటీవల షాద్‌నగర్‌లో ఈగల్ కుంగ్-ఫూ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో జాతీయ మార్షల్ ఆర్ట్స్ ఛాంపియన్ షిప్- 2024 పోటీలు జరిగాయి. వీటిలో కొడంగల్ పట్టణంలోని కస్తూర్బా గాంధీ విద్యార్థినులు పాల్గొని అత్యుత్తమ ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రతిభ కనబర్చిన విద్యార్థినులను ఎస్పీ నారాయణరెడ్డి అభినందించారు.

భూములు ఇవ్వండి.. పరిహారం చెల్లిస్తాం


సమావేశంలో పాల్గొన్న సబ్ కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్

తాండూరు టౌన్, న్యూస్‌టుడే: భూములు ఇవ్వండి.. పరిహారం చెల్లిస్తామని తాండూరు సబ్ కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్ తెలిపారు. తాండూరు బైపాస్ రోడ్డు నిర్మాణంలో భూములు కోల్పోతున్న చెంగోల్, అంతారం రైతులతో సబ్ కలెక్టరు కార్యాలయంలో మంగళవారం సమావేశం నిర్వహించారు. పరిహారం ఇవ్వాలని చాలా కాలంగా రైతులు డిమాండ్ చేస్తున్నారు. వారికి ఆయన అవగాహన కల్పించారు. కార్యక్రమంలో తహసీల్దార్ తారాసింగ్, ఆర్ అండ్ బీ ఈఈ శ్రీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సిబ్బంది సమయానికి రావాలి

బషీరాబాద్, న్యూస్‌టుడే: వైద్యులు, ఇతర సిబ్బంది ఆసుపత్రికి సమయానికి వచ్చి మెరుగైన వైద్య సేవలు అందించాలని తాండూరు సబ్ కలెక్టర్ ఉమాశంకర్ పేర్కొన్నారు. మంగళవారం ఆయన బషీరాబాద్ మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రి, నవల్గా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. వైద్య సిబ్బంది, హాజరైన వారు వివరాలు తెలుసుకున్నారు. కొందరు గైర్హాజరైనట్లు గుర్తించారు. అక్కడున్న కొందరు రోగులతో మాట్లాడారు. వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటించడం లేదని ఆయన దృష్టికి తీసుకెళ్లారు.

గని కార్మిక సంఘం నూతన కమిటీ

తాండూరు గ్రామీణ: మల్కాపూర్ గని కార్మిక సహకార సంఘానికి నూతన కార్యవర్గం ఏర్పాటు చేస్తూ నియామక పత్రాలను తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి చేతుల మీదుగా మంగళవారం అందజేశారు. అధ్యక్షులుగా ఎస్.పండరి, సభ్యులుగా రాందాస్, మల్లేషం, మౌలానా, నర్సింహులు, గోపాల్‌తో కార్యవర్గాన్ని ప్రజాభవన్‌లో ప్రకటించారు. డీసీసీబీ ఉపాధ్యక్షులు రవీందర్‌గౌడ్, కాంగ్రెస్ ముఖ్య నాయకులు ధారాసింగ్, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

లాభాల డ్రాగన్

32 రకాల ప్రదర్శన ● సాగుకు ప్రోత్సాహం



బ్రోచర్‌ను విడుదల చేస్తున్న ఉద్యానశాఖ అధికారులు, రైతులు

న్యూస్‌టుడే, సంగారెడ్డి మున్సిపాలిటీ

డ్రాగన్ ఫ్రూట్ ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. జిల్లాలో సాగు విస్తీర్ణం తక్కువ, ధర ఎక్కువ కావడంతో పేద, మధ్య తరగతి ప్రజలు కొనలేక పోతున్నారు. ఈ నేపథ్యంలో సాగు విస్తీర్ణం పెంచేందుకు సంగారెడ్డిలోని డా.కొండా లక్ష్మణ్ బాపూజీ ఫల పరిశోధన కేంద్రం శ్రీకారం చుట్టింది. మంగళవారం డ్రాగన్ ఫ్రూట్ మేళా నిర్వహించి అవగాహన కల్పించింది. మేళాలో 32 రకాలు ప్రదర్శించారు. రెడ్ స్కిన్‌డ్, రాయల్ పింక్, బ్లడ్‌మారి, మిస్టర్‌వో తదితర రకాలున్నాయి.



5వేల ఎకరాల్లో సాగు లక్ష్యం..

సంగారెడ్డి జిల్లాలో డ్రాగన్ సాగుకు మంచి అవకాశాలున్నాయని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. సంగారెడ్డి, కొండాపూర్, జహీరాబాద్‌లో 142 ఎకరాల్లో పండిస్తున్నారు. మేళాలో పలువురు రైతులు వారి అనుభవాలు వివరించారు. జిల్లాలో తొలుత 5వేల ఎకరాల్లో సాగు చేసేలా ఉద్యానశాఖ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.



రైతులకు అవగాహన కల్పించేందుకే..

– నీరజ ప్రభాకర్, ఉపకులపతి, కొండా లక్ష్మణ్ బాపూజీ తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయం

మార్కెట్లో పండు ధరలు ఎక్కువగా ఉన్నాయి. సామాన్యులకు అందుబాటులోకి రావాలంటే జిల్లాలో సాగు విస్తీర్ణం పెరగాలి. ఈ ఉద్దేశంతోనే ఫల పరిశోధన కేంద్రంలో మేళా నిర్వహించాం. రైతులు అనుభవాలు వివరించారు. చక్కెర శాతం తక్కువగా ఉండడంతో మధుమేహులూ తినొచ్చు.

ఎకరాకు పది లక్షల పండ్లు

– డా.హరికాంత్, సీనియర్ శాస్త్రవేత్త, ఎఫ్ఆర్ఎస్


పంటపై రైతులకు ఇప్పుడిప్పుడే అవగాహన కలుగుతోంది. జిల్లాలో 150 ఎకరాల్లో డ్రాగన్ పంట సాగవుతోంది. ఒక్కో పండు రూ.100- 150 ఉంటుంది. జూన్- ఆగస్టు మధ్యలో దిగుబడి వస్తుంది. ఎకరాకు 10 లక్షల పండ్లు పండించొచ్చు. పంట ఎలా సాగు చేయాలో రైతులకు వివరించాం.

పాడైనా నష్టం లేదు..

డ్రాగన్ పండ్లు విక్రయం కాకున్నా పారేయాల్సిన అవసరం లేదు. పాడైన వాటితోనూ వివిధ రకాల వస్తువులు తయారు చేయొచ్చని ప్రదర్శనలో చూయించారు. సబ్బులు, పాపడ్, గుల్మన్, క్యాండి, లిప్ బామ్, చిప్స్‌ను ఎలా తయారు చేయొచ్చో ప్రయోగాత్మకంగా వివరించారు.



మేళాలో ప్రదర్శించిన ఉద్యాన పంటల విలువ ఆధారిత వస్తువులు



అవగాహన కల్పించారు.. ఇక సాగు చేస్తా..

ఇప్పటి వరకు ఎన్నో పంటలు సాగు చేశా. పెట్టుబడి ఎక్కువగా పెడుతున్నా ఆశించిన లాభాలు మాత్రం రావడం లేదు. మేళాకు రావడంతో డ్రాగన్ ఎలా సాగు చేయాలో తెలుసుకున్నా. ఈసారి పండించాలని నిర్ణయించుకున్నా.

– విశ్వప్రసాద్, రైతు, మారేపల్లి



65 రకాలు పండించా..

65 రకాల పండ్లు పండించా. ఏడాదిపాటు కష్టపడితే రెండేళ్ల తరవాత కోతకు వస్తుంది. పెట్టుబడికి రెండింతల లాభాలొస్తాయి. దీనిపై రైతులకు అవగాహన కల్పించాల్సిన అవసరముంది. అధికారులు ప్రోత్సహిస్తే చిన్న, సన్నకారు రైతులకు ఉపయోగంగా ఉంటుంది.

– రమేశ్‌రెడ్డి, రైతు, రంజోల్, జహీరాబాద్



గతేడాది రూ.7 లక్షల ఆదాయం

మూడేళ్లుగా రెండెకరాల్లో డ్రాగన్ ఫ్రూట్ పండిస్తున్నా. ఎకరాకు రూ.3.50 లక్షల పెట్టుబడి పెట్టా. గతేడాది రూ.7 లక్షల ఆదాయం వచ్చింది. ఈసారి రూ.12 లక్షలు ఆర్జించా. అధికారులు ప్రత్యేక చొరవ తీసుకొని అన్నదాతలను ప్రోత్సహించాలి.

– మదన్ మోహన్‌రెడ్డి, రైతు, తెర్పోల్



పతకాలు, ప్రశంసాపత్రాలతో మెదక్ జట్టు క్రీడాకారిణులు, అదనపు పాలనాధికారి వెంకటేశ్వర్లు, డీవైఎస్‌వో దామోదర్‌రెడ్డి, ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి రమేష్

రాష్ట్ర ఫుట్‌బాల్ ఛాంపియన్ మెదక్

మెదక్ టౌన్: పాఠశాల క్రీడ సమాఖ్య(ఎస్‌జీఎఫ్) 68వ రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ అండర్-17 బాలికల ఛాంపియన్‌గా మెదక్ జట్టు నిలిచింది. గత మూడు రోజుల నుంచి మెదక్ పట్టణంలోని ఇందిరాగాంధీ స్టేడియం, వెస్లీ పాఠశాల మైదానంలో కొనసాగుతున్న ఫుట్‌బాల్ పోటీలు మంగళవారం అట్టహాసంగా ముగిశాయి. లీగ్ దశ నుంచి అత్యంత ప్రతిభ కనబర్చిన మెదక్, రంగారెడ్డి జట్లు ఫైనల్ పోరుకు అర్హత సాధించాయి. రంగారెడ్డి-1, మెదక్-2 పాయింట్లు సాధించడంతో ఛాంపియన్‌గా ప్రకటించారు.



ఫైనల్‌లో తలపడుతున్న మెదక్, రంగారెడ్డి జిల్లాల క్రీడాకారిణులు

క్రీడలతో మంచి భవిష్యత్తు

క్రీడలపై దృష్టి పెట్టి రాణించిన వారికి మంచి భవిష్యత్తు ఉంటుందని మెదక్ అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు అన్నారు. బహుమతుల ప్రదానోత్సవంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి రమేష్ మాట్లాడుతూ... మెదక్ ప్రథమ, రంగారెడ్డి ద్వితీయ, నిజామాబాద్ తృతీయ స్థానాల్లో నిలిచాయన్నారు. అనంతరం విజేతలకు డీవైఎస్‌వో దామోదర్‌రెడ్డి, అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు పతకాలు, జ్ఞాపికలను అందజేశారు. పోటీల కోఆర్డినేటర్ నాగరాజు, వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నాగరాజు, శ్రీనివాసరావు, పీడీలు ప్రతాప్‌సింగ్, మాధవరెడ్డి, రవి, సత్యం పాల్గొన్నారు.

మహాలక్ష్మీదేవిగా చదువుల తల్లి



ప్రసిద్ధ వర్గల్ విద్యా సరస్వతి క్షేత్రంలో నవరాత్రి ఉత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. మంగళవారం విద్యా సరస్వతి అమ్మవారిని శ్రీమహాలక్ష్మిగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు.

- న్యూస్‌టుడే, వర్గల్

కమనీయ రూపం.. కాత్యాయనీ అవతారం

వికారాబాద్ వైభవలక్ష్మి ఆలయంలో మంగళవారం అమ్మవారు కాత్యాయనీ దేవిగా (గాయత్రీ దేవి)గా దర్శనమిచ్చారు. అమ్మ రూపాన్ని చూసి భక్తులు తన్మయత్వం చెందారు.

- న్యూస్‌టుడే, వికారాబాద్ మున్సిపాలిటీ



రాష్ట్ర స్థాయి ఖోఖో బాలికల జట్ల ఎంపికలు



నర్సాపూర్: నర్సాపూర్ గిరిజన సంక్షేమ బాలుర గురుకుల పాఠశాల ఆవరణలో ఖేలో ఇండియా ఖోఖో ఉమ్మడి జిల్లా స్థాయి జూనియర్, సబ్ జూనియర్ బాలికల ఎంపిక పోటీలను మంగళవారం నిర్వహించారు. రెండు విభాగాల్లో అయిదుగురు చొప్పున ఎంపిక చేశారు. వారు ఈనెల 9వ తేదీన నల్గొండలో జరిగే రాష్ట్ర స్థాయి ఖేలో ఇండియా ఎంపిక పోటీల్లో పాల్గొనడానికి అర్హత సాధించారన్నారు. కన్వీనర్ మహేందర్‌రావు, సభ్యులు పోచప్ప, నాగరాజు, నర్సాపూర్ బాలుర ఉన్నత పాఠశాల పీడీ శ్రీకాంత్‌గౌడ్ సమక్షంలో ఎంపిక పోటీలు నిర్వహించారు.

చేతివృత్తులకు పునరుజ్జీవం

పీఎం విశ్వకర్మ పథకంతో స్వయం ఉపాధికి భరోసా

న్యూస్‌టుడే, కొండపాక గ్రామీణం

పోటీ ప్రపంచంలో గ్రామీణ వడ్రంగులు తయారు చేసే సాంప్రదాయ వస్తువులకు విపణిలో ఆదరణ కరవై అనేక మంది వృత్తిని వదిలేసి ఇతర రంగాల వైపు వెళుతున్నారు. యంత్రాలతో పోటీపడలేక గ్రామీణ పేద విశ్వకర్మలు నిత్యం జీవనోపాధికి కూలీ, ఇతర పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఇలాంటి వారికి ఉచితంగా అధునాతన నైపుణ్య శిక్షణ, ఆర్థిక సహకారం అందించి ప్రోత్సహించేందుకు అందుబాటులోకి వచ్చిన కేంద్ర ప్రభుత్వ పథకమే పీఎం విశ్వకర్మ.

ఆన్‌లైన్‌లో దరఖాస్తు..

ఈ పథకంలో దాదాపు 18 రకాల సాంప్రదాయ కళాకారులు, చేతివృత్తుల వారికి ఉచితంగా నైపుణ్య శిక్షణ అందించి వారు స్వయం ఉపాధి పొందేలా కేంద్రం ప్రోత్సహిస్తోంది. ఆసక్తి ఉన్న అభ్యర్థులు కుల ధ్రువీకరణ పత్రాలతో ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్‌తోపాటు దరఖాస్తు చేసుకోవాలి. సంబంధిత శాఖ అధికారులు కొందర్ని ఎంపిక చేస్తారు. వారిని బృందాలుగా విభజించి స్థానిక ప్రభుత్వ ఐటీఐ కళాశాలలకు పంపుతారు. అక్కడ శిక్షకుడు అయిదు రోజులపాటు పాఠాలు బోధించడంతోపాటు అధునాతన నైపుణ్య శిక్షణ అందిస్తారు. శిక్షణ పూర్తి చేసుకున్న అభ్యర్థులకు ధ్రువపత్రంతోపాటు రోజుకు రూ.500 చొప్పున ఉపకార వేతనం అందిస్తారు. కుకునూరుపల్లి మండల కేంద్రంలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో పీఎం విశ్వకర్మ శిక్షణకు ఎంపికైన 33 మంది మొదటి బ్యాచ్ అభ్యర్థులకు అధునాతన వడ్రంగి నైపుణ్య శిక్షణ విజయవంతంగా పూర్తయింది. మరో బ్యాచ్ అభ్యర్థుల ఎంపిక ప్రక్రియ కొనసాగుతోంది. పీఎం విశ్వకర్మ శిక్షణ పూర్తి చేసుకున్న అభ్యర్థులకు త్వరలోనే రూ.15 వేల టూల్ కిట్ అందనుంది. సొంతంగా వ్యాపారం చేసుకోవాలని భావిస్తే పీఎం విశ్వకర్మ ధ్రువపత్రాల ఆధారంగా రూ.1- 3 లక్షల వరకు బ్యాంకులు లోన్ సదుపాయం కల్పించనున్నాయి. దీంతో విశ్వకర్మల జీవితాల్లో వెలుగులు నింపి ఉన్నతంగా ఎదగడానికి ఎంతో ఉపయోగపడనుంది.



కుకునూరుపల్లి ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో శిక్షణ

సద్వినియోగం చేసుకోండి..

–వెంకటరమణ, ప్రిన్సిపల్, ఐటీఐ కళాశాల, కుకునూరుపల్లి

పీఎం విశ్వకర్మ శిక్షణతో స్వయం ఉపాధితో స్థిరపడాలనుకుంటున్న వారికి ఉపయోగపడుతుంది. ఆసక్తి ఉన్న అభ్యర్థులు పీఎం విశ్వకర్మ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి సొంతంగా దుకాణాలు ఏర్పాటు చేసుకోవడానికి బ్యాంకులు రుణ సదుపాయం కల్పిస్తాయి.



తయారు చేసిన కళాకృతులు

సిద్దిపేట జిల్లా కోహెడ మండలం శనిగరంలో నిజాం కాలంలో నిర్మించిన చెరువు, పరిసరాలు ప్రజలకు ఆహ్లాదం కలిగిస్తున్నాయి. ఈ చెరువును 1891లో నిర్మించారు. నిండుగా, అందమైన పరిసరాలతో కూడిన ఈ ప్రాంతానికి చుట్టుపక్కల మండలాల ప్రజలు సెలవు రోజుల్లో వస్తుంటారు. ఇది 5,100 ఎకరాల ఆయకట్టుకు సాగునీటిని అందిస్తోంది.

– న్యూస్‌టుడే, కోహెడ గ్రామీణం



కొండల మధ్య చెరువు.. ఆహ్లాదానికి నెలవు

చారిత్రక వైభవం.. భవానీమాత ఆలయం

న్యూస్‌టుడే, జహీరాబాద్: దసరా అంటేనే నవరాత్రులు గుర్తుకొస్తాయి. అమ్మవారిని పూజించటం ఈ పండగ ప్రత్యేకత. తుల్జాభవానీ అమ్మవారు వెలిసిన ఆలయం అనగానే మహారాష్ట్రలోని తుల్జాపూర్ అని అందరికీ తెలుసు. సంగారెడ్డి జిల్లా మొగుడంపల్లి మండలం ఖాన్‌జమాల్‌పూర్(భవానమ్మపల్లె)లో కొలువైన తుల్జాభవానీ మాత ఆలయానికీ అంతటి చరిత్ర ఉందని పూర్వీకులు చెబుతున్నారు. రాష్ట్ర సరిహద్దులోని ఈ గ్రామంలో దాదాపు 800 ఏళ్ల కిందట ఛత్రపతి శివాజీ మహారాజ్ ఈ ఆలయాన్ని నిర్మించినట్లు చరిత్రకారులు తెలిపారు. యుద్ధానికి వెళుతూ జహీరాబాద్‌కు 15 కి.మీ. దూరంలోని ఖాన్‌జమాల్‌పూర్‌లో సేదతీరారని, విజేతగా వస్తే అమ్మవారి ఆలయం నిర్మిస్తానని మొక్కుకున్నారని చరిత్ర చెబుతోంది. ఆయన విజయం సాధించాక ఆలయం నిర్మించారని తెలుస్తోంది.





ఆలయంలో కొలువైన అమ్మవారు

చెక్కుచెదరని మెట్ల బావి..: ఆలయం చుట్టూ ప్రహరీ, కొంత దూరంలో కందకం, ప్రధాన ద్వారం నిర్మించారు. ఆలయం పక్కనుంచి లోతైన సొరంగ మార్గమున్న ఆనవాళ్లు ఇప్పటికీ కనిపిస్తాయి. గుడి పక్కనే ఎర్రరాయితో నిర్మించిన మెట్ల బావి ఇప్పటికీ చెక్కుచెదరలేదు. శిథిలావస్థకు చేరుతున్న ఆలయ పునర్నిర్మాణానికి దాతలు ముందుకొస్తున్నారు. ప్రతి మంగళ, శుక్రవారాలతోపాటు దసరా, దీపావళి, అమావాస్య, పౌర్ణమి రోజుల్లో భక్తులు వస్తుండటంతో ఏడాదిపాటు ఆలయం సందడిగా మారుతోంది. దసరా పండగకు భక్తులు భారీగా తరలి రానుండడంతో ఆలయ కమిటీ ఏర్పాట్లు చేస్తోంది. ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఆలయాన్ని సర్వాంగ సుందరంగా అలంకరించారు. మరింత అభివృద్ధి చేసి పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలని పరిసర గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

12 ఏళ్లుగా పాదయాత్ర..: ఛత్రపతి శివాజీ నిర్మించిన ఆలయ ప్రాధాన్యాన్ని వివరించేందుకు 12 ఏళ్లుగా ఈ ప్రాంతంలోని యువకులు పెద్ద ఎత్తున పాదయాత్ర నిర్వహిస్తున్నారు. పరిసర గ్రామాలకు చెందిన యువకులు పదుల సంఖ్యలో పాల్గొని ఏటా దసరా నవరాత్రి ఉత్సవాల సందర్భంగా జహీరాబాద్ పట్టణంలోని పురాతన భవానీమాత ఆలయం నుంచి ఖాన్‌జమాల్‌పూర్ భవానమ్మపల్లె వరకు పాదయాత్ర చేస్తుంటారు. ఈనెల 10న ఉదయం పాదయాత్రకు ఏర్పాట్లు చేశారు.

మూఢ నమ్మకాల నిర్మూలనపై ప్రచార కార్యక్రమాలు



మాట్లాడుతున్న జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షుడు, బాధ్యులు

మెదక్, న్యూస్‌టుడే: గ్రామాల్లో కులాల మధ్య ఆధిపత్య పోరు సమాజంలో అంతరాలు పెంచేలా ఉందని జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షుడు చలిమెల రాజేశ్వర్ అన్నారు. మంగళవారం వేదిక బాధ్యులు కలెక్టర్ రాహుల్‌రాజ్, ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డిని కలిశారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ.. ఆదిలాబాద్ ఏజెన్సీ ప్రాంతాల కంటే మారుమూల పల్లెల్లో మూఢనమ్మకాలు అధికంగా ఉన్నాయన్నారు. రామాయంపేట మండలం క్యాత్రియాల్‌లో ఇటీవల దాయాదుల మధ్య నెలకొన్న గొడవల కారణంగా ముత్తవ్వను సజీవ దహనం చేశారన్నారు. ఈ ఘటనపై డీజీపీని కలిశామని, ఆయన సూచన మేరకు దసరా తర్వాత జిల్లాలో పోలీస్, రెవెన్యూ శాఖల సహకారంతో ప్రజాచైతన్య కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. మూఢ నమ్మకాలను నిర్మూలించేలా ప్రచార కార్యక్రమాలు చేపడతామన్నారు. రాష్ట్ర బాధ్యులు పద్మ, మహేందర్, వెంకట్ రమణారెడ్డి, పాల్‌రాజ్, వరప్రసాద్, నాగభూషణం, జిల్లా కార్యదర్శి దేవ్లా పాల్గొన్నారు.

స్వాతంత్ర్య సమరయోధుడు లింగమయ్యగౌడ్ మృతి



జోగిపేట టౌన్, న్యూస్‌టుడే: సంగారెడ్డి జిల్లా జోగిపేట పట్టణానికి చెందిన స్వాతంత్ర్య సమరయోధుడు, తామరపత్ర గ్రహీత గడీండ్ల లింగమయ్యగౌడ్ (96) అనారోగ్యంతో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందారు. రైతాంగ సాయుధ పోరాటంలో పాల్గొని ఆయన జైలుపాలయ్యారు. కర్ణాటక గుల్బర్గా జైలులో 25 రోజులున్నారు. 50 ఏళ్ల స్వాతంత్ర్య వేడుకల్లో అప్పటి రాష్ట్రపతి కేఆర్ నారాయణ చేతుల మీదుగా రాష్ట్రపతి భవనంలో సత్కారం పొందారు.

ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్య

నర్సాపూర్ రూరల్: ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన నర్సాపూర్ మండలంలో జరిగింది. ఎస్సై లింగం తెలిపిన వివరాలు.. బ్రాహ్మణపల్లికి చెందిన గుండె కరుణాకర్(45) కూలీ పనులు చేస్తూ జీవనం సాగించేవాడు. ఏడాది క్రితం పెద్దకూతురు వివాహం చేశాడు. పెళ్లికి అయిన అప్పు ఎలా తీర్చాలని తరచూ ఆవేదన చెందేవాడు. మంగళవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో దూలానికి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. పిల్లలు వచ్చేసరికి చనిపోయాడు. భార్య సంతోష ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై లింగం తెలిపారు.

మద్యం మత్తులో మరొకరు...

ఆదిలాబాద్ నేర విభాగం: ఆదిలాబాద్ పట్టణంలోని టీచర్స్‌కాలనీలో అద్దెకు ఉంటున్న దీపల్లి నరేందర్‌రెడ్డి(27) సోమవారం రాత్రి అద్దె ఇంట్లో ఉరేసుకొని బలవన్మరణానికి పాల్పడ్డాడు. వికారాబాద్ జిల్లా మేడికొండకు చెందిన దీపల్లి నరేంద్రరెడ్డి మూడేళ్ల కిందట ఆదిలాబాద్ జిల్లాకు చెందిన అమ్మాయిని వివాహం చేసుకొని ఏడాదిన్నరగా టీచర్స్ కాలనీలో ఉంటున్నట్లు మావల ఎస్ఐ విష్ణువర్ధన్ తెలిపారు. మద్యం మత్తులో ఉరేసుకొని ఉంటాడని భావిస్తున్నట్లు పేర్కొన్నారు. కుటుంబ సభ్యులు వికారాబాద్ నుంచి వచ్చాక వివరాలు తెలిసే అవకాశం ఉందన్నారు.



స్తంభానికి కట్టేసి కొట్టారని ఏడుగురిపై కేసు

శివ్వంపేట, న్యూస్‌టుడే: వ్యక్తిని స్తంభానికి కట్టేసి దాడి చేసిన ఏడుగురిపై పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. శివ్వంపేట ఎస్సై మహిపాల్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. శివ్వంపేట మండలం గోమారం గ్రామానికి చెందిన కమ్మరి కృష్ణ ఈనెల 1న తను స్నానాల గదిలో ఉండగా చూశాడని ఓ మహిళ.. పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు. మరుసటి రోజు ఇంట్లో పడుకొని ఉండగా మహిళ కుటుంబ సభ్యులు బయటికి లాక్కొచ్చి స్తంభానికి కట్టేసి కర్రలతో కొట్టారని కృష్ణ మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో మహిళతో పాటు ఏడుగురిపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

చికెన్ ధరలు

ఫాంరేటు	114–00
రిటైల్	136–00
డ్రెస్డ్	197–00
స్కిన్‌లెస్	224–00

సంచికి దూరం.. సృజనకు చేరువ

వర్గల్, న్యూస్‌టుడే: వర్గల్ జవహర్ నవోదయ విద్యాలయంలో సంచికి దూరం కార్యక్రమం మంగళవారం ముగిసిందని, పిల్లల్లో సృజనాత్మకత పెంచడానికి వివిధ కార్యక్రమాలు నిర్వహించామని ప్రిన్సిపల్ రాజేందర్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా పలు రంగులద్దడం, ముగ్గులు వేయడం, క్రీడలు, సంచుల తయారీ, కుట్టు మిషన్ లో మెలకువలు, నర్సరీలో మొక్కలు పెంచడం, కూరగాయల సాగు, వీణ, వయోలిన్ వాయించడం, తదితర అంశాల్లో మెలకువలు నేర్పించామన్నారు. విద్యాలయ పూర్వ విద్యార్థి డాక్టర్ సాయినాథ్ రెడ్డి పలు సూచనలిచ్చారు.



ఫ్లూట్, వయోలిన్ వాయిస్తున్న విద్యార్థులతో ప్రిన్సిపల్ రాజేందర్, ఉపాధ్యాయ బృందం

అంతర్రాష్ట్ర దొంగల ముఠా అరెస్టు

పోలీసుల అదుపులో ఆరుగురు ● నాలుగేళ్లుగా 36 చోరీలు

మాదాపూర్: తాళం వేసిన ఇళ్లే లక్ష్యంగా చోరీలకు పాల్పడుతున్న మధ్య ప్రదేశ్‌కు చెందిన అంతర్రాష్ట్ర దొంగల ముఠా సైబరాబాద్ సీసీఎస్ పోలీసులకు పట్టుబడింది. సైబరాబాద్, రాచకొండ కమిషనరేట్లతోపాటు సంగారెడ్డి, మెదక్, నల్గొండ జిల్లాల్లో 36 చోరీలకు పాల్పడిన రెండు ముఠాలకు చెందిన ఆరుగురు ఘరానా దొంగలను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. నిందితుల నుంచి ఆరు కత్తులతోపాటు కట్టర్లు స్వాధీనం చేసుకున్నారు. మంగళవారం మాదాపూర్ డీసీపీ కార్యాలయంలో రాజేంద్రనగర్ డీసీపీ సీహెచ్ శ్రీనివాస్, సైబరాబాద్ క్రైమ్స్ విభాగం డీసీసీ నర్సింహ తెలిపిన వివరాలు.. మధ్యప్రదేశ్‌లోని ధార్ జిల్లా కుక్షి తహసీల్‌లోని ఖనియాంబకు చెందిన కరన్ మనోహర్‌బాబర్, ప్యార్‌సింగ్ బవుల, డెబ్రాబవుల, కడక్‌సింగ్, చిరాడ్‌కు చెందిన ఠాకూర్ ఈడియ, కుమన్ ఈడియ జల్సాలకు అలవాటు పడి చోరీల బాటపట్టారు. కరన్ మనోహర్‌బాబర్, కడక్‌సింగ్ నేతృత్వంలో రెండు ముఠాలుగా ఏర్పడి తెలుగు రాష్ట్రాల్లో చోరీలు చేస్తున్నారు.



సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న డీసీపీలు శ్రీనివాస్, నర్సింహ

ఆయుధాలతో సంచరిస్తూ..

గతనెల 19, 20, 21వ తేదీల్లో మియాపూర్, బాచుపల్లి, సూరారం, పేట్‌బషీరాబాద్ ఠాణాల పరిధుల్లో చోరీలకు పాల్పడ్డారు. సైబరాబాద్ కమిషనర్ ఆదేశాల మేరకు సీసీఎస్ మాదాపూర్, సీసీఎస్ బాలానగర్ జోన్ బృందం పోలీసుల సహకారంతో దర్యాప్తు చేపట్టారు. సోమవారం కరన్ మనోహర్‌బాబర్ బృందంతో కలిసి మియాపూర్‌లో ఆయుధాలు, కట్టర్లున్న సంచులతో సంచరిస్తూ పట్టుబడ్డారు. కడక్‌సింగ్ ముఠా వివరాలు చెప్పడంతో పోలీసులు అందరినీ అదుపులోకి తీసుకున్నారు.

మరో 8 మంది పరారీ..

రెండు ముఠాలకు చెందిన సమర్‌సింగ్, మోహన్, అర్జున్, దయాసింగ్, కైలాష్, భురియా, సొత్తు కొంటున్న రోహిత్‌సోని, గౌరవ్ పరారీలో ఉన్నారని పోలీసులు తెలిపారు.

గుంతలో పడి వ్యక్తి మృతి



లక్ష్మయ్య

కౌడిపల్లి, న్యూస్‌టుడే: ద్విచక్రవాహనంపై వస్తూ రోడ్డు పక్కన ఉన్న గుంతలో పడి వ్యక్తి మృతిచెందిన ఘటన కౌడిపల్లి మండలం కొత్తచెరువు తండా గ్రామ పంచాయతీ మొండితండా వద్ద చోటుచేసుకుంది. ఎస్ఐ రంజిత్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు.. చిలప్‌చెడ్ మండలం సోమక్కపేట గ్రామానికి చెందిన చీమల లక్ష్మయ్య(49) డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. సోమవారం రాత్రి ద్విచక్రవాహనంపై వస్తుండగా.. మొండితండా వద్ద అదుపుతప్పి రోడ్డు పక్కన గుంతలో పడిపోయాడు. మాజీ ఎంపీటీసీ సభ్యుడు కిషన్‌నాయక్ గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించాడు. కుటుంబీకులు వచ్చి లక్ష్మయ్యను ఆటోలో నర్సాపూర్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి మృతిచెందినట్లు నిర్ధారించారు. మృతుడి కుమారుడు నవీన్ మంగళవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ రంజిత్‌రెడ్డి తెలిపారు. లక్ష్మయ్యకు భార్య భూదెమ్మ, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలి దుర్మరణం

రాయపోల్, న్యూస్‌టుడే: బైక్‌పై వెనుక కూర్చున్న మహిళ రోడ్డుపై పడగా.. ఆమె పైనుంచి వాహనం వెళ్లడంతో అక్కడికక్కడే దుర్మరణం చెందింది. ఈ ఘటన సిద్దిపేట జిల్లా రాయపోల్ మండలం లింగారెడ్డిపల్లి శివారులో చోటుచేసుకుంది. బాధిత కుటుంబ సభ్యులు, రాయపోల్ ఎస్ఐ రఘుపతి తెలిపిన వివరాలు... గజ్వేల్ మండలం జాలిగామకు చెందిన రాసమల్ల సూరమ్మ (60) వారి వియ్యంకుడి మూడో రోజు కర్మ కార్యక్రమంలో పాల్గొనడానికి రాయపోల్ వెళ్లింది. తర్వాత రాత్రి జాలిగామకు చెందిన రమేశ్ బైక్‌పై వస్తుండగా ప్రమాదవశాత్తు ఆమె కింద పడింది. అదే సమయంలో వచ్చిన గుర్తు తెలియని వాహనం పైనుంచి వెళ్లగా తీవ్రగాయాలతో చనిపోయింది. ఆమె భర్త రాములు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పేదల ఆరోగ్యానికి ప్రాధాన్యం: మనోహర్‌రెడ్డి

యాలాల, పెద్దేముల్: ప్రజా ప్రభుత్వంలో పేదలకు పెద్ద పీట వేస్తున్నామని ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి అన్నారు. మంగళవారం యాలాల మండల పరిధిలోని ప్రజాభవన్‌లో 45 మందికి రూ.14లక్షల విలువైన సీఎంఆర్‌ఎఫ్ సహాయనిధి చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పేదలకు కార్పొరేట్ వైద్యం సీఎం సహాయ నిధి ద్వారా అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో తాండూరు మార్కెట్ కమిటీ వైస్ ఛైర్మన్ నర్సిరెడ్డి, మాజీ ఎంపీపీ కరణం పురుషోత్తంరావు, మాజీ జడ్పీటీసీ సభ్యుడు సిద్రాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణ పనులకు భూమిపూజ

దౌల్తాబాద్, బొంరాస్‌పేట: నియోజకవర్గంలోని ప్రతి గ్రామానికి తారు రోడ్డు సౌకర్యం కల్పిస్తామని కాంగ్రెస్ జిల్లా ప్రధానకార్యదర్శి మేడి వెంకటయ్య అన్నారు. మంగళవారం ఆయన దుద్యాల మండలం చిల్ముల్‌మైలారం నాస్కాన్‌పల్లి గ్రామాల మీదుగా కొడంగల్ మండలం పర్సాపూర్ వరకు ఉన్న తారు రోడ్డును రెండు వరుసల రోడ్డు నిర్మాణం కోసం భూమి పూజ చేశారు. ఈ రోడ్డు నిర్మాణం కోసం ప్రభుత్వం రూ.4కోట్లు మంజూరు చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచి అంజాద్ తదితరులు పాల్గొన్నారు.

అధ్వానంగా రహదారులు..

నవాబ్‌పేట: ఇటీవల కురిసిన వర్షాలకు రహదారులు ఛిద్రమయ్యాయి. మీనేపల్లి కలాన్ - కడిచర్ల, ఆర్కతల - మీనేపల్లి కలాన్, నవాబ్‌పేట - యావాపూర్, గుబ్బడిఫతేపూర్ - ముబారక్‌పూర్ గ్రామాల పరిధిలోని వ్యవసాయ పొలాలు వెళ్లే రైతులు సరైన దారులు లేక ఇబ్బందులు పడుతున్నారు.

సమీకృతం.. ఆమడ దూరం

పాలకులు దృష్టి సారిస్తే మేలు

న్యూస్‌టుడే, పరిగి, వికారాబాద్ మున్సిపాలిటీ:


పరిగిలో నిలిచిన పనులు

ప్రజలకు ఒకేచోట తాజా కూరగాయలతో పాటు మాంసం, పాల ఉత్పత్తుల విక్రయాలకు అనువుగా ఉండేందుకు రెండేళ్ల క్రితం సమీకృత మార్కెట్ల నిర్మాణ పనులకు గత ప్రభుత్వం సుమారు రూ.22కోట్లతో శ్రీకారం చుట్టింది. ఆశయం మంచిదే అయినా జిల్లాలో తాండూరు, వికారాబాద్, పరిగి, కొడంగల్ ప్రాంతాల్లో చేపట్టిన నాలుగింటికీ ఏ ఒక్కటీ నేటికీ అందుబాటులోకి రాలేదు. దీంతో పట్టణ వాసులు నిత్యం అవస్థలు పడుతున్నారు. పండ్లు ఒక చోట, కూరగాయలు మరో చోట, మాంసం ఇంకో ప్రాంతంలో ఎక్కడ పడితే అక్కడ విక్రయాలు నిర్వహిస్తున్నారు. పలు చోట్ల నడిరోడ్డుపైనే అమ్మకాలు జరుగుతున్నాయి. ప్రజల రాకపోకల సమయాల్లో తరచూ చోటు చేసుకుంటున్న ప్రమాదాలు ఆందోళన కలిగిస్తున్నాయి. నిధుల కొరత, ప్రభుత్వం మారడంతో ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయి.

తాండూరులోనూ అదే పరిస్థితి

వాణిజ్య కేంద్రమైన తాండూరు పట్టణంలోనూ సమీకృత మార్కెట్ భవన నిర్మాణ పనులు ఆమడ దూరంలోనే ఉన్నాయి. వాణిజ్య పరంగా ఎదుగుతున్నా మౌలిక సదుపాయాల కల్పనలో మున్సిపాలిటీ వెనుకబడి ఉంది. వెరసి చిరు వ్యాపారులు రోడ్డుపైనే విక్రయించక తప్పడం లేదు. కొడంగల్‌లో నాణ్యతా లోపంతో మధ్యలోనే అధికారులు పనులు ఆపేశారు.

ఇదిగో ఇలా..

పరిగిలోని పాత మార్కెట్ ప్రాంతంలో రూ.4కోట్ల అంచనా వ్యయంతో నిర్మాణ పనులు ప్రారంభించారు. నిధుల కొరత కారణంగా అవి అసంపూర్తిగానే ఉన్నాయి. దీంతో కూరగాయల విక్రయాలు వ్యవసాయ మార్కెట్ యార్డు షెడ్డులోనూ, గంజ్‌రోడ్డులోనూ విక్రయాలు జరుగుతున్నాయి. అసంపూర్తి పనులతో విక్రయదారులతో పాటు ఉత్పత్తిదారులకు కూడా అష్టకష్టాలు తప్పడం లేదు.

జిల్లా కేంద్రంలో 108 దుకాణాలు

వికారాబాద్‌లో 108 దుకాణాలను ఏర్పాటు చేసి పేదలకు ఇవ్వాలని తలపెట్టారు. ఏడాదిలోపే పనులు పూర్తిచేసి వినియోగంలోకి తీసుకురావాలన్న లక్ష్యం నీరుగారింది. స్థలాల కొరతతో ఆరుబయట పేదలు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ఇవి పూర్తయితే పురపాలికలకు అదనపు ఆదాయ వనరులు అందనున్నాయి. సరిపడా నిధులు మంజూరు చేసి సత్వరం పూర్తయ్యే విధంగా ప్రజా ప్రతినిధులు దృష్టి సారించాలని పలువురు నిరుపేదలు కోరుతున్నారు.

నిధులు మంజూరు కాగానే పూర్తి



– వెంకటయ్య, కమిషనర్, పరిగి

సమీకృత మార్కెట్ నిర్మాణానికి అదనపు నిధులు అవసరం ఉన్నాయి. ఈమేరకు ఉన్నతాధికారులకు ప్రతిపాదించాం. నిధులు రాగానే తిరిగి పనులు చేపడతాం.

నిరంతర సాధనతో విజయం: ఎస్పీ

వికారాబాద్, న్యూస్‌టుడే: గెలుపోటములే జీవిత పాఠాన్ని నేర్పుతాయి. గెలుపుతో పొంగిపోకుండా నిరంతర సాధనతో నైపుణ్యానికి మరింత పదును పెట్టాలి. ఓటమితో కుంగిపోకుండా తప్పు ఎక్కడ జరిగిందన్నది తెలుసుకొని, పట్టుదలతో గెలుపు అవకాశాలను సృష్టించుకోవాలని జిల్లా ఎస్పీ నారాయణ రెడ్డి తెలిపారు. మంగళవారం జిల్లా పోలీసు కేంద్రంలో శిక్షణ పొందుతున్న కానిస్టేబుళ్లకు 100, 200 మీటర్ల పరుగు పందెం, వాలీబాల్, క్రికెట్, టగ్ ఆఫ్ వార్ తదితర పోటీల ముగింపు కార్యక్రమంలో పాల్గొని, పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, జీవితం ఒక ఆటలాంటిదని, ఎవరు బాగా ఆడితే వారే జీవితంలో నిలదొక్కుకొని ఉన్నత స్థానానికి చేరుకుంటారని అన్వయించి చెప్పారు. ఓటమి బలహీనతలను పరిచయం చేస్తుందని, వీటిని అధిగమించి గెలుపు బాట పట్టాలన్నారు. పోలీసు శిక్షణ కేంద్రం ప్రిన్సిపల్, ఏఎస్పీ మురళీధర్ మాట్లాడుతూ, జీవితంలో ఎదురయ్యే సవాళ్లను మానసికంగా తట్టుకోవడానికి క్రీడలు బాగా అనుభవ నేర్పుతాయన్నారు. ఏఎస్పీ రవీందర్‌రెడ్డి, డీటీసీ డీఎస్పీ విజయ్‌కుమార్, ఏఆర్ డీఎస్పీ వీరేష్, సీఐ, ఎస్‌ఐలు పాల్గొన్నారు.

సేవలు అభినందనీయం

దౌల్తాబాద్, కొడంగల్: అమ్మ నాన్న ఫౌండేషన్ అందిస్తున్న సేవలు అభినందనీయమని డిప్యూటీ డీఎమ్‌ఎచ్‌వో రవీంద్రయాదవ్ అన్నారు. మంగళవారం ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఓ పంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అనాథలకు, పేద విద్యార్థులకు చేయూతనందించారు. పాతకొడంగల్, టేకుల్‌కోడ్ గ్రామాలకు చెందిన వారికి దసరా పండగ సందర్భంగా కిరాణా సరకులు, దుస్తులు అందించారు.

అభివృద్ధిని అడ్డుకునేందుకే పాదయాత్ర

కొడంగల్, దౌల్తాబాద్: కొడంగల్ నియోజకవర్గంలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులను అడ్డుకునేందుకే భారాస నాయకులు పాదయాత్ర చేస్తున్నట్లు కాంగ్రెస్ కొడంగల్, దౌల్తాబాద్ మండలాల అధ్యక్షులు నందారం ప్రశాంత్, వెంకట్‌రావులు ఆరోపించారు. మంగళవారం వారు కొడంగల్‌లో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు.

ఘనాపూర్‌లో నేడు గోమాత పూజ

కుల్కచర్ల గ్రామీణ: ఘనాపూర్ గ్రామంలోని శ్రీ రామలింగేశ్వర గోశాలలో నేడు గోమాత పూజా కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు వెంకటయ్యగౌడ్, రాఘవేందర్‌గౌడ్, అంజిలయ్య, చంద్రయ్య తెలిపారు. ఉదయం 10 గంటలకు శివలింగానికి అభిషేకం నిర్వహించనున్నట్లు చెప్పారు.

నల్లబ్యాడ్జీలతో ఏఈవోల నిరసన

కుల్కచర్ల: డిజిటల్ క్రాప్ సర్వే చేయడం తమకు కుదరదని, ఇప్పటికే పని ఒత్తిడితో సతమతం అవుతున్నామని కుల్కచర్ల, చౌడాపూర్ మండలాల విస్తరణాధికారులు విశ్వనాథ్, వంశీకృష్ణ, నిఖిత, భావన తదితరులు తెలిపారు. కుల్కచర్ల మండల కేంద్రంలోని రైతువేదికలో జరిగిన రైతునేస్తం కార్యక్రమానికి వారు నల్లబ్యాడ్జీలతో హాజరయ్యారు.

రజకుల సంక్షేమానికి నిధులివ్వండి

దౌల్తాబాద్, బొంరాస్‌పేట: రజకుల సంక్షేమం కోసం ప్రభుత్వం బడ్జెట్‌లో రూ.500 కోట్లు కేటాయించాలని రజక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గోపి అన్నారు. ఆయన దుద్యాల మండలకేంద్రంలో ఏర్పాటు చేసిన రజకుల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. చెన్నప్ప, మొగులయ్య, వెంకటయ్య, అనంతయ్య, భీములు తదితరులున్నారు.

ఆర్థిక సహాయం అందజేత

కుల్కచర్ల గ్రామీణ: సాల్వీడ్‌లో అనారోగ్యంతో దాసరి లక్ష్మయ్య మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న పీఏసీఎస్ డైరెక్టర్ కొండయ్య బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. అంత్యక్రియల నిమిత్తం రూ.9 వేలు ఆర్థిక సహాయం అందించారు.

కల్వర్టు నిర్మాణమెప్పుడు?



కుల్కచర్ల, న్యూస్‌టుడే: పలు చోట్ల రహదారుల మధ్య శిథిలమైన కల్వర్టులు ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. ఏళ్ల తరబడి ఈ సమస్య వేధిస్తున్నా.. అధికారులు దృష్టి సారించకపోవడంతో వాహనదారులకు ఇక్కట్లు తప్పడం లేదు. దీనికి తోడు ప్రతి వర్షాకాలంలో నీరు కల్వర్టులపై నుంచి పారతుండడం వల్ల రాకపోకలు స్తంభిస్తున్నాయి. ఈ సమస్య కుల్కచర్ల, దోమ మండలాల్లో ప్రధానంగా నెలకొంది. దాదాపూర్, రాంనగర్, బండవెల్కిచర్ల రూట్లలో శిథిలమైన పాత కల్వర్టుల స్థానాల్లో కొత్త వాటిని నిర్మించాలని, గొడుగొనిపల్లి వద్ద కల్వర్టు ఎత్తు పెంచాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

రాష్ట్ర కార్యవర్గంలో స్థానంపై హర్షం

తాండూరుగ్రామీణ: పీఆర్‌టీయూ రాష్ట్ర కార్యవర్గంలో తాండూరు మండల ఉపాధ్యాయులకు స్థానం దక్కడంపై ఆ సంఘం తాండూరు మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జొన్నల వినోద్, పట్లోళ్ల పురుషోత్తంరెడ్డి మంగళవారం హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడిగా ఎన్నికైన బెల్కటూరు ప్రధానోపాధ్యాయులు రామ్‌నర్సింహారెడ్డి, ఉపాధ్యక్షురాలుగా అల్లాపూర్ ప్రధానోపాధ్యాయులు అంబమ్మ, కార్యదర్శులుగా మహాలక్ష్మి, వీరేశం ఎన్నికవడంతో వారికి శుభాకాంక్షలు తెలిపారు.

రమణీయ దృశ్యం.. రాఘవాపూర్ సొంతం



చేపల వేటలో జాలరులు.. జలాశయాన్ని ఆనుకుని ఉన్న పచ్చని పంట పొలాలు.. ఆహ్లాదకరంగా పచ్చని చెట్లు.. చిన్న చిన్న గుట్టలు.. ప్రకృతి అందాలు చూపరులను ఆకట్టుకుంటున్నాయి. అక్కడక్కడ ఏర్పాటు చేసిన పవన విద్యుత్తు పంకాలు మరింత చూడముచ్చటగా కనిపిస్తున్నాయి. ఇది ఎక్కడో నదీ జలాల పక్కన కాదు.. పరిగి మండలం రాఘవాపూర్ గ్రామ జలాశయ (చెరువు) పరిసరాలు. – న్యూస్‌టుడే, పరిగి గ్రామీణ



పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

కుల్కచర్ల, న్యూస్‌టుడే: మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో 2003-04 బ్యాచ్ పూర్వవిద్యార్థుల సమ్మేళనం జరిగింది. అప్పట్లో కలసి చదువుకున్న వారంతా ఒక్క చోట చేరడంతో వారి ఆనందానికి అవధులు లేకుండా పోయింది. ఒకరికి ఒకరు ఆలింగనం చేసుకొని బాగోగులను అడిగి తెలుసుకున్నారు.

తాండూరులో భాజపా సంబురాలు


వేడుకల్లో పార్టీ నాయకులు

తాండూరు టౌన్, న్యూస్‌టుడే: హరియాణా అసెంబ్లీ ఎన్నికల్లో భాజపా గెలుపుతో తాండూరులో పార్టీ నాయకులు మంగళవారం విజయోత్సవం నిర్వహించారు. పట్టణంలోని ఇందిరా గాంధీ కూడలిలో నాయకులు, కార్యకర్తలు టపాసులు కాల్చారు. మిఠాయిలు పంచారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రమేష్ కుమార్, నాయకులు మల్లేశం, భద్రేశ్వర్, బాలి శివ కుమార్, కృష్ణ, శ్రీహరి, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పైప్‌లైన్ పనులకు మరమ్మతులు

పరిగి, న్యూస్‌టుడే: 'నీరు కలుషితం..వ్యాధుల భయం!' శీర్షికతో ఈనెల 4న 'ఈనాడు'లో ప్రచురితమైన వార్తకు పురపాలక శాఖ అధికారులు స్పందించారు. పలుచోట్ల పైపుల లీకేజీతో కలుషితమవుతున్న ప్రాంతాలను పరిశీలించి మరమ్మతు పనులు చేపట్టారు. ప్రజలకు పరిశుభ్రమైన నీటిని సరఫరా చేస్తున్నట్లు కమిషనర్ వెంకటయ్య తెలిపారు.

అసభ్యకరంగా ప్రవర్తించిన వ్యక్తిపై కేసు

కుల్కచర్ల గ్రామీణ, న్యూస్‌టుడే: యువతితో అసభ్యకరంగా ప్రవర్తించిన పుట్టాపహాడ్ గ్రామానికి చెందిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు కుల్కచర్ల ఎస్సై అన్వేష్‌రెడ్డి తెలిపారు. వివరాలు.. ఓ గ్రామానికి చెందిన ఓ యువతి ఈ నెల 6న పొలం దగ్గర గేదెలను మేపుతోంది. అదే సమయంలో స్థానికుడు రఘు ఆమె దగ్గరకు వెళ్లి చేయి పట్టుకుని అసభ్యకరంగా ప్రవర్తించాడు. యువతి గట్టిగా అరవడంతో అక్కడే పొలం పక్కనే ఉన్న మహిళలు వచ్చారు. దీంతో అతడు పారిపోయాడు. ఆ యువతి మంగళవారం పోలీసులను ఆశ్రయించింది. యువతి ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలియజేశారు.


గౌతాపూర్ అమ్మవారు..


భూకైలాష్‌లో..


తాండూరు టౌన్: దాండియా ఆడుతున్న పుర అధ్యక్షురాలు స్వప్న

భక్తిశ్రద్ధలతో పూజలు

జిల్లా వ్యాప్తంగా భక్తిశ్రద్ధలతో అమ్మవారి పూజలు నిర్వహిస్తున్నారు. పలు చోట్ల ప్రత్యేక అలంకరణలు ఆకట్టుకున్నాయి. గౌతాపూర్ శివారులోని చెరువెంటి ఈశ్వరాలయంలో సందడిగా జరిగాయి. పరిగిలో మహాచండీ హోమం జరిపారు. బండవెల్కిచర్ల గ్రామ పరిధిలోని పాంబండ రామలింగేశ్వర స్వామి దేవాలయం దగ్గర దుర్గామాతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. – న్యూస్‌టుడే, బృందం


పరిగిలో పూజల్లో పాల్గొన్న కాలనీ వాసులు


పాంబండలో మహాలక్ష్మిగా..


దౌల్తాబాద్‌లో పూజలు చేస్తున్న భక్తులు..

నీడా లేదు.. నీరూ కరవే!

ఆర్టీసీ ప్రయాణికులకు తప్పని కష్టాలు

న్యూస్‌టుడే, పరిగి గ్రామీణ, దోమ: ఆర్టీసీ బస్సుల కోసం స్టేజీల దగ్గర నిరీక్షిస్తున్న ప్రయాణికులు పడరాని పాట్లు పడుతున్నారు. రహదారుల పక్కన, ప్రధాన కూడళ్ల దగ్గర బస్ షెల్టర్లు, మౌలిక వసతులు లేక ఇబ్బందులకు గురవుతున్నారు. గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణాలకు వెళ్లాలంటే (అరకొర బస్సుల కోసం) వేచిచూడాల్సిందే. ఈ క్రమంలో నిలబడేందుకు నీడ లేక, కూర్చునేందుకు బల్లాలులేక నానా అవస్థలు తప్పడం లేదు. కూడళ్ల దగ్గర తాగునీటికోసం గతంలో చేతిపంపులు ఏర్పాటు చేసినా.. అవి నిర్వహణలేక నిరుపయోగంగా మారాయి. వర్షాకాలంలో చెట్ల కింద తలదాచుకుంటే పిడుగుల భయం, ఎండాకాలంలో ఎండలో నిలబడితే వడదెబ్బ తప్పదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


బస్ షెల్టర్‌లేని సయ్యద్‌పల్లి, రాపోల్ కూడలి..

మచ్చుకు కొన్ని సమస్యలు

- పరిగి మండలం సయ్యద్‌పల్లి, రాపోల్ కూడలి పరిగి- షాద్‌నగర్ రహదారిపై ఉంది. సుమారు 12 గ్రామాల ప్రజలు బస్సుల్లో ప్రయాణించేందుకు ఇక్కడికి చేరుకునే కేంద్రంగా చెప్పవచ్చు. ప్రతి రోజు విద్యార్థులతో పాటు వందలాది మంది బస్సుల కోసం ఇక్కడే వేచిచేస్తుంటారు. ఇక్కడ బస్సు షెల్టరు లేక.. తాగునీటి వసతి లేని కారణంగా ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు.
- సయ్యద్‌మల్కాపూర్, నజీరాబాద్‌తండా, జాఫర్‌పల్లి, ఖుదావంద్‌పూర్, గూడూరు గేట్ల దగ్గర కూడా ప్రయాణికులకు నిలువ నీడ లేదు. తాగునీటి సౌకర్యం లేదు.
- గుండాల్ గేట్‌దగ్గర ఉన్న చేతిపంపు మరమ్మతుకు గురైంది. వేసవిలో దాహార్తి తీర్చుకోడానికి ఇబ్బందులు పడుతున్నారు.
- మండల కేంద్రం దోమ, పాలేపల్లి, ఐనాపూర్, మల్లేపల్లి, దాదాపూర్, ఊటుపల్లి గ్రామాల్లో బష్‌షెల్టర్లు ఏర్పాటుచేయాల్సి ఉంది.
- మోత్కూర్ గ్రామం ప్రధాన రహదారికి రెండు కిలోమీటర్ల దూరంలో ఉంది. ఆగ్రామస్తులంతా అంతదూరం నుంచి కాలినడకన రావల్సి వస్తుంది. ఇక్కడ సరైన నీడలేక ఎండలకు తాళలేక పోతున్నారు. ఇక వర్షాకాలంలో ఉరుములు, మెరుపులకు పిడుగుపాటు భయంతో చెట్లకింద ఉండలేక వర్షాలకు తడిసి ముద్దవుతున్నారు.
- పద్మానగర్ వాసులకు బస్సు సౌకర్యం లేక పాలేపల్లి వరకు కాలినడకన వచ్చి నిరీక్షించాల్సిందే.. ఇక్కడ స్థలం లేక రోడ్డుపక్కన వేచి చూడాల్సిన పరిస్థితి.

దాతలు, ప్రజాప్రతినిధుల సహకారంతో కృషి

–కరుణశ్రీ, పరిగి ఆర్టీసీ డిపో మేనేజరు

బస్సు షెల్టర్లు లేని విషయం ఇప్పటికే మాదృష్టికి వచ్చింది.. దాతలు, ప్రజాప్రతినిధులు సహకారంతో అవసరమున్న చోట నిర్మించడానికి ప్రయత్నిస్తాం. రెక్వెస్ట్ స్టాప్‌ల దగ్గర సదుపాయలు కల్పించలేం.


బస్సు ఎక్కుతున్న విద్యార్థులు

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల దస్త్రాల పరిశీలన

మోమిన్‌పేట్, న్యూస్‌టుడే: ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ.. రోగులకు సేవలు అందించాలని ఎంపీడీవో విజయలక్ష్మి వైద్యాధికారి రషీద్, వైద్య సిబ్బందికి సూచించారు. మంగళవారం మోమిన్‌పేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా రోజువారీగా కేంద్రానికి వచ్చే రోగుల వివరాలు నమోదు చేసే దస్త్రాలను నిల్వ ఉన్న మందులు పరిసరాల పరిశుభ్రతను పరిశీలించి మాట్లాడారు. కార్యక్రమంలో వైద్యురాలు సుజల ఫార్మాసిస్టు విజయ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.


ఔషధాలను పరిశీలిస్తున్న ఎంపీడీవో విజయలక్ష్మి

పారిశుద్ధ్య లోపం.. పల్లెలకు శాపం

గ్రామాల్లో ఇళ్ల మధ్యనే మురుగు

న్యూస్‌టుడే, కుల్కచర్ల గ్రామీణ, కుల్కచర్ల: గ్రామాల్లో పారిశుద్ధ్య వ్యవస్థ అధ్వానంగా మారింది. వీధుల్లో ఎక్కడ చూసినా ఇళ్ల మధ్యన మురుగు నీరు నిలిచిపోయి కనిపిస్తోంది. దీంతో ఈగలు, దోమల బెడద ఎక్కువగా కనిపిస్తోందని ప్రజలు చెబుతున్నారు. ఇందుకు కారణంగా గ్రామాల్లో అధికారుల పర్యవేక్షణ అంతంతమాత్రంగానే ఉండటమే. గ్రామాల్లో సర్పంచులు ప్రజలు అందుబాటులో ఉండి మురుగు కాలువలు, వీధి దీపాల ఏర్పాటు, నీటి సరఫరాలో జాప్యం ఏర్పడితే ఎప్పటికప్పుడూ పర్యవేక్షించే వారు. కానీ సర్పంచుల పదవీకాలం ముగియడంతో గ్రామాల్లో సమస్యలు పెరిగాయని పలువురు చెబుతున్నారు.


కుల్కచర్లలో ఇళ్ల మధ్య..

చాలా చోట్ల ఇలా..

- కుల్కచర్ల కల్యాణ్‌నగర్ కాలనీలో ఇళ్ల మధ్యన నీరు నిలిచిపోయింది. కొన్ని నెలలుగా ఈ సమస్యతో ఇబ్బందులు పడుతున్నామని కాలనీవాసులు చెబుతున్నారు. దోమలు వ్యాపించడంతో రోగాల బారినపడుతున్నామంటున్నారు.


అంగడిబజార్ కాలనీలో...

- కామన్‌పల్లి ప్రధాన చౌరస్తాలో కూడా ఈ సమస్య ఉంది. మురుగు కాలువ లేకపోవడంతో రోడ్డుకు పక్క నుంచే మురుగు నీరు పారుతోంది.
- చింతల్‌కుంట తండాలో ఇళ్ల మధ్యనా.. అదే పరిస్థితి. కాలువలు నిర్మించాల్సి ఉంది.
- కుల్కచర్ల చౌరస్తాలో ఈ సమస్య ఎక్కువగా ఉంది. పూర్తి స్థాయిలో మురుగు కాలువలు నిర్మించాలి ప్రజలు కోరుతున్నారు.
- దోమ మండల ఊటుపల్లిలో రోడ్డుకు పక్క నుంచే వృథా నీరు పారుతూ ఉంది. చాలా రోజులుగా ఈ సమస్య ఇలాగే కనిపిస్తుంది.
- బండవెల్కిచర్ల ఎస్సీ కాలనీలో మురుగు సమస్య ఉంది. సమస్య పరిష్కరించేలా చూడాలని కాలనీవాసులు కోరుతున్నారు.

ఇబ్బందులు తప్పడం లేదు

– విజయ్, కుల్కచర్ల, కల్యాణ్‌నగర్ కాలనీ

మా ఇళ్ల మధ్యన చాలా రోజులుగా మురుగు నీరు నిలిచిపోయింది. మురుగు నీరు నిలిచిపోవడంతో దోమలు ఎక్కువగా వృద్ధి చెందుతున్నాయి. మురుగు కాలువలు నిర్మించాలని కోరుతున్నా.. ఎవరూ పట్టించుకోవడం లేదు. ఖాళీ స్థలాలన్నింటిలోనూ ఇదే దుస్థితి. జనం రోగాల బారినడుతున్నారు.

పరిష్కరించేలా చూస్తాం

– రామకృష్ణనాయక్, ఎంపీడీవో, కుల్కచర్ల

పారిశుద్ధ్య వ్యవస్థపై ప్రత్యేక దృష్టి సారించాలని పంచాయతీ కార్యదర్శులకు ఎప్పటికప్పుడూ సూచనలు అందిస్తున్నాం. వర్షాకాలంలో దోమల బెడద ఎక్కువగా ఉంటుంది. కాబట్టి ముఖ్యంగా వృథా నీరు నిల్వకుండా దృష్టి సారించేలా చూస్తున్నాం.

కొడంగల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్‌గా అంబయ్య

దౌల్తాబాద్, కొడంగల్: కొడంగల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్‌గా అంబయ్యగౌడ్ నియమితులయ్యారు. రుద్రారం గ్రామానికి చెందిన ఆయన కాంగ్రెస్‌లో కీలకంగా పనిచేస్తున్నారు. గత జడ్పీటీసీ ఎన్నికల్లో స్వల్ప మెజార్టీతో ఓటమి పాలయ్యారు. ఈ కమిటీ ఎంపికలో దౌల్తాబాద్ మండలానికి సముచిత స్థానం కల్పించారు. తిమ్మారెడ్డిపల్లికి చెందిన రాములు, ఇండాపూర్ నర్సింలు, పోల్కంపల్లి సేవ్యానాయక్ డైరెక్టర్‌లుగా నియమితులయ్యారు.

- కొడంగల్ మార్కెట్ కమిటీ వైస్ ఛైర్మన్‌గా వేణుగోపాల్ నియమితులయ్యారు. ఈ మేరకు మంగళవారం ఉత్వర్వులు వెలువడ్డాయి. మొదటి నుంచి పార్టీలో ఉండడంతో ఈ పదవి వరించింది.

అన్ని హామీలను ప్రభుత్వం అమలు చేస్తోంది

దోమ: ప్రభుత్వం ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తోందని కాంగ్రెస్ దోమ మండల అధ్యక్షుడు విజయ్‌కుమార్‌రెడ్డి, అన్నారు. మంగళవారం దోమ మండలం పాలేపల్లి, ఖమ్మం నాచారం, ఐనాపూర్ గ్రామాల్లో మహాలక్ష్మి పథకంలో భాగంగా వంటగ్యాస్ ప్రొసిడింగ్‌లు అందించారు. నాయకులు రాఘవేందర్‌రెడ్డి, యాదవరెడ్డి, రాములు, ప్రశాంత్, మొగులయ్య పాల్గొన్నారు.

10న జీవాల విపణి ప్రారంభం

తాండూరుగ్రామీణ: ఖాంజాపూర్ గేటు వద్ద మేకలు, గొర్రెల విపణిని ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి ఈనెల 10న ప్రారంభిస్తున్నట్లు వ్యవసాయ విపణి అధ్యక్షులు బాల్‌రెడ్డి తెలిపారు.